క్లుప్తంగా

స్వాతంత్య్ర దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

బోట్‌క్లబ్‌: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్‌ కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రగతిని తెలిపే స్టాల్స్‌ ఏర్పాటు చేయడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలన్నారు. శకటాలు ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు చేశాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమాన్ని వీక్షించే వారికి అవసరమైన తాగునీరు, వైద్య సదుపాయంతో పాటు పారిశుధ్యం మెరుగుపర్చాలన్నారు.

ఎమ్మెల్యే కురసాలను కలసిన చింతా



ఎమ్మెల్యే కన్నబాబును కలసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న చింతా ఈశ్వరరావు

కాకినాడ రూరల్‌: గుంటూరు నాగార్జున అగ్రికల్చర్‌ యూనివర్సిటీ డైరెక్టరుగా నియమితులైన కరప మండల వైఎస్సార్‌ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు శనివారం ఉదయం రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వంగా కలిశారు. ఎమ్మెల్యే కన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ కురసాల సత్యనారాయణలను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

పీఎంఏవై గృహాల తనిఖీ



అరట్లకట్టలో పీఎంఏవై ఇళ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

కరప: మండల పరిధిలో నిర్మించిన పీఎంఏవై గృహాలను సెంట్రల్‌ ఏజెన్సీస్‌ టీమ్‌, హౌసింగ్‌ అధికారులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అరట్లకట్ట, నడకుదురు, పెనుగుదు గ్రామాల్లో శనివారం వాప్‌కాస్‌ (డబ్ల్యుపీసీఓఎస్‌) సెంట్రల్‌ ఏజెన్సీ బృందం ప్రతినిధి సముద్దీన్‌, హౌసింగ్‌ డీఈఈ కేవీఆర్‌ గుప్తా, ఏఈఈ సుంకర రాంబాబు, సిబ్బంది పర్యటించి పీఎంఏవై పథకంలో నిర్మించిన గృహాలకు బిల్లులు అందాయా, లేదా, నిర్మించిన గృహాలలో సౌలభ్యంగా నివాసముంటున్నారా లేదా తనిఖీచేసి, లబ్ధిదారులను అడిగితెలుసుకున్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్‌: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కోరమాండల్‌ మహిళా క్లబ్‌ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్‌ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా తమ క్లబ్‌ ద్వారా ప్రతి నెలా పేద మహిళలు, ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, లక్ష్మీ సృజన, విజయలక్ష్మి, మోహిని కుమారి, శిరీష, అడబాల రత్నప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

కాకినాడ రూరల్‌: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శనివారం అడబాల ట్రస్ట్‌ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్‌ఆర్‌ రంగనాథం చిత్రపటానికి నివాళులర్పించి, విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావును సత్కరించారు. అడబాల రత్నప్రసాద్‌, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్‌, శిరీష, రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్కళలో దేశభక్తి గీతాల పోటీలు

కాకినాడ కల్చరల్‌: స్థానిక ఎన్‌ఎఫ్‌సీఎల్‌ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం 4 గంటలకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్‌ ఈవీ కృష్ణమాచార్యులు తెలిపారు. విజేతలకు అగస్టు 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు హాజరు కావాలని కోరారు.

జనసేన నాయకుల పర్యటన

కరప: గ్రామంలో శనివారం జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి పంతం నానాజీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించి జనం కోసం పవన్‌, పవన్‌ కోసం జనం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామకమిటీ అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్‌, భోగిరెడ్డి కొండబాబు, ముద్రగడ రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా బతికేలా..

- దర్జీలకు చేదోడుగా నిలచిన జగనన్న
- వారి ఖాతాల్లో ఏటా రూ.10 వేల జమ
- ఆనందం వ్యక్తం చేస్తున్న టైలర్లు



నూతన వస్త్రాలు కుడుతున్న టైలర్‌

బోట్‌క్లబ్‌: ఒకప్పుడు చేతినిండా పని, జేబునిండా డబ్బులు ఇది ఓ దర్జీ కుటుంబ జీవనం. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. పండగల్లో మాత్రమే ఏదో కాస్తా పని ఆడడంతో వారి కుటుంబాన్ని నెట్టికొస్తున్నారు. గతంలో పండుగలు, పెళ్లిళ్ల వస్తున్నాయంటే టైలర్ల వద్దకు వెళ్లి కొత్త బట్టలు కుట్టించుకొనే వారు. దీంతో వారితో పాటు పదిమందికి జీవనోపాధి లభించేది. నేడు చేతులు, కాళ్లకు పని చెప్పినా కుటుంబాన్ని నెట్టుకు రావడం చాలా కష్టమైపోయిందని టైలర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ తరుణంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారికి అండగా నిలిచారు. ప్రతి ఏడాది వారికి రూ.10 వేలు అందించడంతో వాటితో టైలరింగ్‌ మెటీరియల్‌ కొనుగోలు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. గతంలో అయితే చేతి నిండా పని ఉండడంతో పలువురికి జీవనోపాధి కల్పించేవారు. నేడు వారికే పని పూర్తిగా సరిపడక పోవడంతో వేరే వారికి పని లేకుండా పోయింది. గతంలో పండుగ సీజన్‌ వచ్చిందంటే రాత్రి, పగలు కష్టపడాల్సిన పరిస్థితి ఉండేది. ఫ్యాంట్‌, షర్టులకు కాజాలు, బొత్తాలు కుట్టేవారికి సైతం పని ఉండేది. ప్రస్తుతం అన్నీ పనులు టైలర్లు సొంతంగా చేసుకొంటున్నారు. కాకినాడ నగరంలో గతంలో అన్నీ వీధుల్లో టైలరింగ్‌ షాపులు ఉండేవి. కాకినాడ నగరం, రూరల్‌ నియోజవర్గంలో సుమారు 900 మందికి ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

టైలర్లకు చేయూత

పాదయాత్రలో టైలర్ల బాధను స్వయంగా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. వారు ఆ డబ్బులతో జీవనోపాధి పొందుతున్నారు. అర్హులైన ప్రతి టైలర్‌కు ఈ పథకం అమలు చేయడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. గతంలో టైలర్ల ఇబ్బందులు ప్రభుత్వానికి విన్నవించినా వారు పెడచెవిన పట్టేవారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వారిని ఏటా నగదు వారి ఖాతాలో జమ చేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న చేదోడు పథకంతో ఆదుకొంటున్నారు.

ఏటా రూ.10 వేల సాయం

ఏటా చేదోడు పథకంలో టైలర్లకు రూ.10 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందిస్తున్నారు. గ్రామ వార్డు సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే వారికి ఈ పథకం వర్తించే విధంగా చర్యలు తీసుకొంటున్నారు.

కావాల్సిన ధ్రువపత్రాలు

చేదోడు దరఖాస్తు, ఆధార్‌కార్డు జిరాక్స్‌, రైస్‌ కార్డు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌, బ్యాంకు పాస్‌ పుస్తకం, షాపు రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌, ఆదాయ ధ్రువీకరణ పత్రం, దుకాణంతో దరఖాస్తుదారు దిగిన ఫొటో అందజేయాలి. 21 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న వారు మాత్రమే ఈ పథకానికి అర్హులు.

ఎంతో అండగా ఉంటోంది



ఏటా ప్రభుత్వం ఇస్తున్న రూ.10 వేలు సహాయంతో టైలరింగ్‌ మెటీరియల్‌ కొనుగోలు చేసుకొనేందుకు ఉపయోగపడుతుంది. గతంలో పండుగ వస్తే బయట వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సి వచ్చేది. కానీ ముఖ్యమంత్రి మా బాధలు చూసి మాకు సహాయం అందిస్తున్నారు.

– ఓలేటి సూరిబాబు, టైలర్‌

మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు



పాదయాత్రలో టైలర్ల బాధ విని సహాయం చేస్తానని మాట ఇచ్చి ఏటా క్రమం తప్పకుండా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. టీడీపీ హయాంలో ఎన్నో సార్లు ప్రభుత్వానికి తమ బాధలు చెప్పుకున్నా పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి టైలర్లు రుణపడి ఉంటారు.

– వి లోవరాజు, టైలర్‌

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం



వెంకన్నబాబు ఆలయంలో నిర్వహిస్తున్న శాంతి కల్యాణం

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శాంతి కల్యాణం నిర్వహించారు. అధిక శ్రావణమాసం బహుళ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం తెలిపారు. యండమూరు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



కరపలో దోమల నివారణకు మందును పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

కరప: సీజనల్‌ వ్యాధులు వ్యాప్తి చెందకుండా మండల పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం కరప, నడకుదురు తదితర గ్రామాల్లో మోటార్‌ పంపుల ద్వారా దోమల మందును పిచికారీ చేయించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, దేగల లలితకుమారి, కార్యదర్శులు ఎస్‌కే నాగేంద్ర కుమార్‌, పీఎస్‌ఆర్‌ బ్రహ్మానందం, వైఎస్సార్‌ సీపీ నాయకుడు సాదే లోహిదాస్‌ కుమార్‌ తదితరులు దోమల నివారణకు చేపట్టిన మందుల పిచికారీని పర్యవేక్షించారు.

సామూహిక విశ్వకర్మ వ్రతాలు

కాకినాడ కల్చరల్‌: స్థానిక ఆనందభారతి మైదానంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పరిషత్‌, శ్రీవిరాట్‌ విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి శ్రీవిరాట్‌ విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం సామూహిక విశ్వకర్మ వ్రతాలు నిర్వహించారు. అలాగే శ్రీపార్వతి పరమేశ్వర కల్యాణం వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వ హించారు. శ్రీమద్విరాట్‌ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల 8వ తరం వంశస్థులు వీరభద్ర స్వాములు, లక్ష్మీ భ్రమరాంబిక దంపతులు ఆదివారం జరిగే పూజా కార్యక్రమానికి హాజరవుతారని సంఘ అధ్యక్షులు అరటికట్ల రాంబాబు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పర్యావరణానికి మొక్కలు దోహదం



తాళ్లరేవు పాఠశాలలో మొక్కలు నాటుతున్న లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని లయన్స్‌క్లబ్‌ ప్రతినిధులు పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డిలు తెలిపారు. శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్థానిక నూనన్‌ పబ్లిక్‌ స్కూల్‌లో యువతీ యువకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో యానాం, తాళ్లరేవు లయన్స్‌క్లబ్‌ అధ్యక్షులు సహదేవరాజు, చోడే శ్రీనివాస్‌, క్లబ్‌ ప్రతినిదులు జి.సూర్యనారాయణరాజు, కట్టా ఆదినారాయణ, రాయపరాజు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన



మెడికవర్‌ ఆస్పత్రిలో అవయవ దానంపై అవగాహన కల్పిస్తున్న ప్రముఖులు, వైద్యులు

కాకినాడ రూరల్‌: అవయవ దానంపై అచ్చంపేట జంక్షన్‌ వద్ద మెడికవర్‌ ఆస్పత్రి ఆధ్వర్యాన యూనిట్‌ హెడ్‌ సిద్ధారెడ్డి అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇండియన్‌ రెడ్‌క్రాస్‌ సొసైటీ చైర్మన్‌ వైడీ రామారావు, డాక్టర్‌ బీవీ రావు మల్టీ ఆర్గాన్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ బాదం బాలకృష్ణ, యూరాలజిస్ట్‌ కల్యాణ్‌బాబు, నెఫ్రాలజిస్ట్‌ అనిల్‌కుమార్‌, లివర్‌ ట్రాన్స్‌ప్లాంట్‌ సర్జన్‌ ఆదిత్య, ఆపరేషన్స్‌ హెడ్‌ ఖాత్రీ, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ వరలక్ష్మి, సిబ్బంది, ఆదిత్య నర్సింగ్‌ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. అవయవ దానం గురించి అతిథులు, వైద్యులు వివరించారు. సరైన వ్యాయామం లేకపోవడం, జంక్‌ ఫుడ్‌, మద్యం, సిగరెట్‌ తాగడం వలన ఎక్కువగా అవయవాలు దెబ్బ తింటున్నాయని చెప్పారు. అటువంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

ఇష్‌తో సమాజానికి ఎంతో మేలు



హైమావతి దంపతులను సత్కరిస్తున్న విశ్రాంత జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ ఎంబీఆర్‌ శర్మ

బోట్‌క్లబ్‌: ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ స్పిరిట్యువల్‌ హ్యాపీనెస్‌ అండ్‌ హెల్త్‌ (ఇష్‌)తో సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని విశ్రాంత జీజీహెచ్‌ సూపరిండెంటెంట్‌ ఎంబీఆర్‌ శర్మ అన్నారు. ఇష్‌ 10వ వార్షికోత్సవాన్ని స్థానిక కాస్మోపాలిటన్‌ క్లబ్‌ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు ఈ సంస్థ ద్వారా అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్‌ హైమావతి ఆదర్శ గృహిణిగా ఉంటూ ధనాపేక్ష లేకుండా మహిళలకు ఎన్నో రకాల సేవలు అందిస్తున్నారని కొనియాడారు. డాక్టర్‌ హైమావతి మాట్లాడుతూ తల్లితండ్రులు, అత్తమామల సహకారంతో నేను ఈ సేవా కార్యక్రమాలు చేయగలుగుతున్నానన్నారు. ఇప్పటి వరకూ తమ సంస్థ ఆధ్వర్యంలో 68 వేల మందికి శిక్షణ, కౌన్సిలింగ్‌ అందించినట్లు చెప్పారు. అనంతరం హైమవతి దంపతులను ఎంబీఆర్‌ శర్మ సత్కరించారు. లయన్స్‌ క్లబ్‌ మాజీ గవర్నర్‌ మంజులూరి విశ్వేశ్వరరావు, డాక్టర్‌ ఎస్‌.మహాలక్ష్మి కుమార్‌ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి తదితరులు

కాకినాడ కల్చరల్‌: స్థానిక రామారావుపేటలో నూతనంగా నిర్మించిన భాస్కర కళావేదిక భవనంలో దేవరకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఎంఎస్‌ సుబ్బులక్ష్మి సంగీత విభావరి అలరించింది. ముందుగా సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి ఎంఎస్‌ సుబ్బులక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కచేరి ప్రారంభించారు. స్థానిక సంగీత విద్వాంసులు చిలుకూరు సుబ్బలక్ష్మి, ప్రభల రాజేశ్వరి, మునుగంటి వెంకట్రావు తదితరులు ఎంఎస్‌ సుబ్బులక్ష్మి, వాగ్గేయకారుల కీర్తనలు వివిధ రాగాలలో ఆలపించి అలరించారు. వీరికీ వయోలిన్‌ విద్వాంసులు హరిప్రసాద్‌, మృదంగం విద్వాంసులు వారణాసి శ్రీనివాస్‌ సంగీత సహకారం అందజేసారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మురళీకృష్ణ, దేవరకొండ నరేన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆజాదీ కా అమృత్‌ మహోత్సవ్‌



విజయరాయుడుపాలెంలో జాతీయజెండాకు వందనం చేస్తున్న అధికారులు, నాయకులు

కరప: మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి ఆజాదీ కా అమృత్‌ మహోత్సవ్‌ నిర్వహించారు. జి.భావారంలో సర్పంచ్‌ రొక్కాల గణేష్‌, కార్యదర్శి పి.ఉమామహేశ్వరి పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు, ఉపాధి సిబ్బందితో కలసి గ్రామంలోని మట్టిని కలశంలో సేకరించి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నా భూమి–నా దేశం శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కను నాటి, ప్రతిజ్ఞ చేయించారు. పాతర్లగడ్డ, పెద్దాపురప్పాడు, సిరిపురం గ్రామాల్లో కూడా సర్పంచ్‌లు నాగిరెడ్డి ఏసుబాబు, నున్న సుజాత, ఏపీఓ ఈ.వెంకటరమణ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

హోటల్‌పై ఫుడ్‌ సేఫ్టీ అధికారుల దాడులు



అధికారులు స్వాధీనం చేసుకున్న నాణ్యత లేని జీడిపప్పు, కారం



కేసు నమోదు చేస్తున్న ఫుడ్‌ సేఫ్టీ అధికారి సుబ్బారావు

- నాణ్యత లేని జీడిపప్పు, కారం గుర్తింపు

బోట్‌క్లబ్‌: స్థానిక రామారావుపేట సెంటర్‌లోని న్యూ కృష్ణాస్‌ సుబ్బయ్య హోటల్‌పై శనివారం ఫుడ్‌ సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. నాలుగు రోజులు క్రితం వినియోగదారుడు కొనుగోలు చేసిన కూరలో నాణ్యత లేకపోవడంతో అతని ఫిర్యాదుపై దాడులు నిర్వహించినట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారి కేవీ సుబ్బారావు తెలిపారు. తాము దాడులు చేసిన సమయంలో నిల్వ ఆహార పదార్థాలు ఏమీ లేవని, అయితే ఆహార పదార్థాలు తయారు చేసేందుకు వినియోగించే జీడీపప్పు, కారం నాణ్యత తక్కువగా ఉందన్నారు. వీటిని శాంపిల్స్‌ తీసి ల్యాబ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. దీనిపై హోటల్‌ యజమాని సుబ్బారావు గుప్తాపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ల్యాబ్‌ నివేదిక వచ్చిన తర్వాత అతనిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

విద్యార్థులు ఐక్యతతో మెలగాలి

- పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి
- ర్యాగింగ్‌ చట్టాలపై అవగాహన



ర్యాగింగ్‌ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ లతాకుమారి

గండేపల్లి: విద్యార్థులు ఐక్యతతో మెలగాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో విద్యార్థులకు శనివారం ర్యాగింగ్‌ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా నడుచుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చి వారి పేరు నిలబెట్టాలన్నారు. విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే భవిష్యత్‌ బాగుటుందని, ప్రతి విద్యార్థి ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. ర్యాగింగ్‌ వల్ల కలిగే నష్టాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆదిత కళాశాలల వైస్‌ చైర్మన్‌ ఎస్‌.సతీష్‌ రెడ్డి ముఖ్య అతిథులను శాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, కళాశాల ప్రిన్సిపాల్‌ దోలా సంజయ్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ కాపుల కల్యాణి, రమేష్‌ రాజా, తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

- విరాళాలు, టిక్కెట్ల ద్వారా రూ.4.43 లక్షల ఆదాయం

పెద్దాపురం: స్థానిక శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పొటెత్తారు. ఆలయ చైర్మన్‌ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి 4,43,079 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. నూతన దంపతులకు, దాతలకు ఆలయ అర్చకుడు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. సుమారు ఆరు వేల మంది స్వామి వారిని దర్శించుకోగా భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించినట్లు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శృంగారవల్లభ స్వామి

పరిశోధనలతోనే ప్రయోజనం

- డాక్టర్‌ వైఎస్సార్‌ హెల్త్‌ వర్సిటీ మాజీ వీసీ డాక్టర్‌ ఐవీ రావు
- ముగిసిన ఎరివ్నా వేడుకలు



డాక్టర్‌ ఐవీ రావును సత్కరిస్తున్న డీఎంఈ, ఆర్‌ఎంసీ, జీజీహెచ్‌ అధికారులు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వేదికగా జరిగిన వైద్య విజ్ఞాన సదస్సు ఎరివ్నా శనివారం ఘనంగా ముగిసింది. దేశ విదేశాల నుంచి వైద్య విద్యార్థులు ప్రాతినిధ్యం వహించిన ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు సాగింది. ఆర్‌ఎంసీలో చివరి సంవత్సరం చదువుతున్న ఎంబీబీఎస్‌ విద్యార్థుల ఆధ్వర్యంలో కోర్‌ కమిటీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఏ.విష్ణువర్ధన్‌ పర్యవేక్షించారు. 530 మంది వైద్య విద్యార్థులు తమ పేరు నమోదు చేసుకుని ఎరివ్నాకు హాజరయ్యారు. 360 మంది వలంటీర్లు కార్యక్రమ నిర్వహణను మూడు రోజుల పాటు తమ భుజాలపై మోసారు. లిటిల్‌ వుడ్స్‌ పాఠశాల అధినేత గన్ని నాగేశ్వరరావు, డాక్టర్‌ లలిత, డాక్టర్‌ ఏఎల్‌ సత్యవతి, డాక్టర్‌ మండవ కృష్ణ, డాక్టర్‌ గుణ్ణం చంద్రమౌళి తలో రూ.50 వేల చొప్పున ఎర్నివా నిర్వహణకు నిధులు సమకూర్చారు. డాక్టర్‌ వాడ్రేవు రవి, చక్రపాణి, సౌజన్య, ఇనోదయ ఆస్పత్రి ఎండీ డాక్టర్‌ రామ్‌ మోహన్‌, సాయి భార్గవ ఇమేజింగ్‌ సెంటర్‌, అవాన్‌ దయాగ్నోస్టిక్స్‌ స్పాన్సర్లుగా వ్యవహరించిన వారిలో ఉన్నారు. శనివారం నాటి ముగింపు కార్యక్రమానికి డాక్టర్‌ వైఎస్సార్‌ హెల్త్‌ యూనివర్సిటీ పూర్వపు వైస్‌ చాన్సలర్‌ డాక్టర్‌ డాక్టర్‌ ఐవీ రావు, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ డీఎస్‌వీఎల్‌ నరసింహం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్‌ ఐవీ రావు మాట్లాడుతూ పరిశోధనలతోనే వైద్య విద్య సంపూర్ణమవుతుందని తెలిపారు. అదే మానవ మనుగడకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. డాక్టర్‌ నరసింహం మాట్లాడుతూ పరిశోధనలపై వైద్య విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన విద్యార్థి బృందాన్ని ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం డాక్టర్‌ ఐవీ రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ హేమలతాదేవి, ఆర్‌ఎంసీ వైస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ దేవీ మాధవి సహా వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.